క్లుప్తంగా

నేడు సిద్ధేశ్వర స్వామి రథోత్సవం



సిద్ధేశ్వర స్వామి రథం

ఆలూరు రూరల్: శ్రావణ మాసం చివరి సోమవారం పురస్కరించుకుని నేడు శ్రీ సిద్ధేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు అశేష భక్తజనం నడుమ రథాన్ని ఎదురు బసవన్న ఆలయం వరకు లాగనున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించారు. రథోత్సవంలో వేలాది భక్తులు పాల్గొననున్న నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

పైర్లలో చీడపీడల వ్యాప్తి నివారించాలి

కృష్ణగిరి: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పైర్లకు ఆశించే చీడపీడలను నివారించాలని ఏఓ ఎస్.వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన ఆదివారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. మండలంలో గత వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు వాడుపట్టిన పంటలకు జీవం వచ్చిందన్నారు. అలాగే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వేరుశనగలో పచ్చ దీపపు పురుగులు ఆశించే అవకాశం ఉందని వీటి నివారణకు 10 లీటర్ల నీటిలో 3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ మందును కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. అలాగే వరిసాగులో చదరపు మీటరు 33 మొక్కలు ఉండేలా నాటుకోవడంతో పాటు కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 15వ తేదీలోగా రైతులందరూ ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



శిశువును చూపుతున్న అంబులెన్స్ సిబ్బంది

హొళగుంద: మండల పరిధిలోని సుళువాయి గ్రామానికి చెందిన చాకలి విశాలాక్షి అనే గర్భిణికి పురిటినొప్పులు రాగా 108 అంబులెన్స్ ఆదుకుంది. అంబులెన్స్ సిబ్బంది సాయం అందించడంతో వాహనంలోనే సుఖ ప్రసవం జరిగి తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. వివరాలు.. నిండు గర్భిణి విశాలాక్షికి ఆదివారం సాయంత్రం పురిటి నొప్పులు తీవ్రం కావడంతో ఆశ కార్యకర్త నాగవేణి 108కు సమాచారం అందించింది. హొళగుంద పీహెచ్‌సీ నుంచి గ్రామానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది గర్భిణిని వాహనంలో ఎక్కించుకుని ఆలూరుకు తరలిస్తుండగా అరికెర గ్రామం వద్ద నొప్పులు తీవ్రం అయ్యాయి. దీంతో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎమ్టీ)లు ఎల్లయ్య, రంగస్వామి, పైలెట్ వినోద్‌కుమార్ వైద్య సాయం అందించడంతో విశాలాక్షి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వారిని ఆలూరు ఆస్పత్రిలో అడ్మిట్ చేసారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. విశాలాక్షికి ఇది మూడవ కాన్పు.

ప్రాజెక్టులు పూర్తిచేయాలి

దేవనకొండ: జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, రైతు సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని పి.కోటకొండ గ్రామంలో ప్రారంభమైన పాదయాత్ర బేతపల్లి, చెల్లెచెలిమల, బంటుపల్లి, గుడిమిరాళ్ల మీదుగా గుండ్లకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. పాలకులు, ప్రజాప్రతినిధుల చిత్తశుద్ధి లోపం వల్ల ఏటా వర్షాభావ పరిస్థితులతో కరువు ఏర్పడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ యేడాది ఖరీఫ్ సీజన్‌లో ఆగస్టులో వర్షాలు లేక పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. రైతులను ఆదుకోవాలని, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, సాగునీటిని అందించాలని కోరారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కమిటీ నాయకులు గౌస్‌దేశాయ్, రైతుసంఘం, ప్రజా సంఘాల నాయకులు అశోక్, శ్రీరాములు, యూసుఫ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

గోనెగండ్ల: 26 జిల్లాల టైలర్ల ఆధ్వర్యంలో ఈ నెల 17న ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని టైలర్ల సంఘం జిల్లా కార్యదర్శి నజీర్ అహమ్మద్ పిలుపునిచ్చారు. ఆదివారం గోనెగండ్లలో టైలర్ల రాష్ట్ర మహాసభకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టైలర్ల సమస్యలను పరిష్కరించుకునేందుకు రాష్ట్ర మహాసభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని జిల్లాల టైలర్లందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. టైలర్లు నరసింహుడు, ఖాసీంవలి, అబ్దుల్ నజీర్, అల్లాబకాష్, గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అనకొండ చంద్రబాబు

- అడ్డంగా దొరికిపోయారు కాబట్టే పక్కా ఆధారాలతో అరెస్ట్ చేసిన సీఐడీ
- ప్రజల్లో సానుభూతి పొందడానికే ఎల్లో మీడియాతో తప్పుడు ప్రచారం
- సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం
- ఎమ్మెల్సీ పొన్నపు రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఎర్రకోట జగన్

గోనెగండ్ల: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అవినీతికి పాల్పడి, కుంభకోణాలకు తెరదీశారు కాబట్టే సీఐడీ అరెస్టు చేసిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా కో–ఆర్డినేటర్ పొన్నపు రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. మండలంలోని హెచ్.కై రవాడి గ్రామంలోని దస్తగిరయ్య స్వామి దర్గా ఆవరణం, గోనెగండ్లలోని బాషా ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గాజులదిన్నె ప్రాజెక్టుకు హంద్రీ–నీవా నుంచి 3 టీఎంసీల నీటి వాటాను కేటాయించి ఈ ప్రాంతానికి తాగు, సాగునీటి సమస్యను తీర్చారని వివరించారు. 40 ఏళ్ల అనుభవంతో ఎలాంటి అభివృద్ధి చేపట్టకపోగా రాష్ట్రాన్ని దివాలా తీయించిన ఘనత చంద్రబాబుది అని విమర్శించారు. అవినీతి కుంభకోణంలో చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్టు చేస్తే ఎల్లో మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో సానుభూతి పొందడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు పాత్రపై పక్కా ఆధారాలు లభ్యమైనందునే అరెస్టయ్యారని, దీనిలో ఎలాంటి రాజకీయ కక్షసాధింపు లేదని, వైఎస్సార్‌సీపీకి సంబంధం లేదన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనని స్పష్టం చేశారు.

అడ్డంగా దొరికినందుకే అరెస్ట్

చంద్రబాబుకు స్కాంలు చేయడం వెన్నతో పెట్టిన విద్య అని, అడ్డంగా దొరికిపోయారు కాబట్టే అరెస్టయ్యారని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో అడుగడుగునా అవినీతి జరిగిందని, పథకాల ద్వారా ఆ పార్టీ నాయకులకే లబ్ధి చేకూరిందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు ప్రతిఒక్కరికీ ఇంటివద్దకే పథకాలు అందిస్తున్నామన్నారు. టీడీపీ హయంలో గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా రైతులకు నీటిని సక్రమంగా సరఫరా చేయలేదన్నారు. జీడీపీ నుంచి తాగు, సాగునీటిని పూర్తిస్థాయిలో అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హంద్రీ–నీవా నుంచి జీడీపీకి 3 టీఎంసీల నీటిని కేటాయించారని, అలాగే జీడీపీ ఆనకట్ట ఎత్తు పెంచితే అదనంగా మరో 1 టీఎంసీ నీటిని నిల్వ చేసుకోవచ్చునని ఇందుకోసం రూ.57 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. దీంతో గోనెగండ్ల, ఎమ్మిగనూరు, డోన్, కృష్ణగిరి, కోడుమూరు తదితర మండలాలకు తాగునీటి సమస్య తీరుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు.

చంద్రబాబును అరెస్టు చేస్తే తప్పేంటి

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అవినీతికి పాల్పడిన చంద్రబాబును సీఐడీ అధికారులు పక్కా ఆధారాలతో అరెస్టు చేస్తే తప్పేంటని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు రూ.371 కోట్లను కనీసం ఆధారాలు లేని కంపెనీల పేరుతో దోచుకున్నారని, ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఆయన్ను సమర్థించడం సిగ్గుచేటని మండిపడ్డారు. చంద్రబాబు కోసం న్యాయవాదులు, కుటుంబ సభ్యులను ప్రత్యేక విమానాల్లో రప్పించారని, అయితే ఆయన మాత్రం హెలికాప్టర్ ఎక్కడానికి నిరాకరించడంపై ఏమనాలని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఔటర్ రింగ్ రోడ్డు, ఫైబర్ గ్రిడ్, అమరావతి ఇలా చాలా స్కాంలలో చంద్రబాబు పాత్ర ఉందని, అన్నింటిపై విచారణ చేపడితే ఆయన శాశ్వతంగా జైల్లోనే ఉండాల్సి వస్తుందన్నారు. త్వరలో టీడీపీ భూస్థాపితం అవుతుందని, ఆ పార్టీ నేతలంతా ఇళ్లకే పరిమితం అవుతారని చెప్పారు.

దోచుకోవడమే చంద్రబాబు పని

ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు అవినీతికి ప్రతిరూపమని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో ప్రభుత్వ ధనాన్ని దోచుకోవడం వల్లనే ప్రస్తుతం సీఐడీ అరెస్టు చేసిందన్నారు. ఆయన అరెస్టు విషయంలో టీడీపీ నేతల కుట్రలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. అనంతరం శివాలయం ఆవరణలో రూ.30 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి వారు భూమిపూజ చేశారు. ఎంపీపీ నసురుద్దీన్, నాయకులు వెంకట్రామిరెడ్డి, మన్సూర్, బందెనవాజ్, భాస్కర్‌రెడ్డి, తిరుమల రెడ్డి, కాశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



తమలపాకుల అలంకరణలో మాళమల్లేశ్వర స్వామి

హొళగుంద: రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో శ్రావణమాసం నాలుగవ ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు మల్లయ్య స్వామి మూల విరాట్‌లకు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, భండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, అర్చనలతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సింహాసన కట్ట ముందు నెరణికి భక్తులు డోలు వాయిస్తూ భక్తిని చాటుకున్నారు. మాళమల్లేశ్వరుడిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

నేడు ‘స్పందన’

కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ రాజేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ తప్పక హాజరుకావాలన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు.



31 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకున్న వెల్దుర్తి జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

వెల్దుర్తి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1991–92 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరిగింది. మండల కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 31 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో ఒక్కచోట చేరి ఒకరినొకరు పలకరించుకుంటూ, నాడు చదువుకున్న పాఠశాల గదులు కలియతిరుగుతూ ఆప్యాయత, అనుబంధాలను పంచుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన తెలుగు మాస్టారు శంకరయ్య, హిందీ మాస్టారు శర్మ, సైన్స్ మాస్టారు కృష్ణకుమార్, రెహమాన్, సుబ్బయ్యలను ఆహ్వానించి శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందించి ఆశీస్సులు పొందారు. కుశల ప్రశ్నలు, యోగక్షేమాలు తెలుసుకుంటూ, తమ విద్య, వైవాహిక, ఉద్యోగ జీవిత విశేషాలు, కుటుంబ నేపథ్యాల గురించి ఒకరికొకరు చెప్పుకుంటూ, సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ ఆనందోత్సవాల మధ్య గడిపారు. గురువులు మాట్లాడుతూ.. తల్లిదండ్రులను గౌరవించాలని, ఆరోగ్యంగా ఉండాలంటూ దీవించారు. తమతోపాటు చదువుకుని ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న విజయను సన్మానించారు. తమతోపాటు చదువుకున్న మహిళలకు ఆడపడుచు చీర అందించి బాధ్యతను చాటుకున్నారు. వంద మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం

వెల్దుర్తి: స్థానిక సంతబజారులో ఆదివారం తెల్లవారుజామున క్షుద్రపూజల కలకలం రేగింది. తండ్రీ, కుమారులు మారెన్న, అశోక్‌లు వివిధ దినపత్రికలలో పాత్రికేయులుగా విధులు నిర్వహిస్తున్నారు. సంతబజారులోని మారెన్న ఇళ్లు కమ్ షాప్ ఎదురుగా గల మెట్లపై క్షుద్రపూజలకు సంబంధించిన ఆనవాళ్లు కనిపించాయి. నిద్రలేచిన కుటుంబీకులు తమ మెట్లపై నిమ్మకాయలు, కుంకుమ, పూలు, ప్లాస్టిక్ కవర్‌లో మరి కొన్ని వస్తువులు, కోడిగుడ్డుపై బొగ్గుతో ముఖచిత్రం ఆకారంలో గీసిన చిత్రం గమనించి భయాందోళనకు గురయ్యారు. ఇలాంటి క్షుద్రపూజల ఆనవాళ్లు తమ ఇంటి ముందు కనిపించడం గత రెండేళ్లలో ఇది పదో సారి అంటూ కుటుంబీకులు తెలుపుతున్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా సంతబజారులో నివాసాలు ఖాళీ చేసేలా ఇలాంటి క్షుద్రపూజలకు పూనుకుంటున్నట్లు తెలుస్తోందని పలువురు పేర్కొంటున్నారు. ఆదివారం నాటి ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి విచారణ చేపట్టారు. క్షుద్రపూజలకు భయపడి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజల చెంతకే సేవలు



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న గురజాల గ్రామ సచివాలయం

నందవరం: పరిపాలనలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. పల్లె ముంగిటకే పాలన సేవలు తెచ్చి గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చింది. గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా ప్రజల చెంతకే సేవలందిస్తోంది. మొక్కుబడిగా కాకుండా.. ఇతర రాష్ట్రాలు సైతం ఔరా అనేలా గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ల నిర్మాణాలు చేపట్టింది. వాటితో పాటు నిరంతర పర్యవేక్షణ సాగించేలా చర్యలు చేపట్టింది. జనన ధ్రువీకరణ పత్రాలు మొదలుకుని స్థలాల రిజిస్ట్రేషన్ వంటి సేవలతో సచివాలయాల ద్వారా దాదాపు 550 రకాల సేవలను అందుబాటులోకి తెవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోంది. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్లు, పాల శీతలీకరణ కేంద్రాలు వంటి భవన నిర్మాణాలతో పల్లెల్లో ప్రగతి పరుగులు పెట్టిస్తుంది. పల్లెల్లో ప్రభుత్వ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దేశంలో ఏ రాష్ట్రంలో జగరని అభివృద్ధి మన రాష్ట్రంలో జరుగుతోంది. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో పల్లెల్లో ప్రజల చెంతకే సేవలు చేరువయ్యాయి.

ఇంటి వద్దకే సేవలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయి. పింఛన్ల పంపిణీ నుంచి కుల, ఆదాయ, బర్త్, రేషన్ కార్డు తదితర సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయి.

మండలంలో 19 సచివాలయాలు ఏర్పాటు

నందవరం మండలంలో ప్రభుత్వం 19 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసింది. 19 సచివాలయాల నిర్మాణానికి రూ.7.55 కోట్లు కేటాయించింది. ఇందులో 18 సచివాలయాల నిర్మాణాలు జరుగుతున్నాయి. మూడు సచివాలయాలు పూర్తయ్యాయి. ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

సచివాలయాల ద్వారా విస్తృత సేవలు



పల్లెల్లో సచివాలయ వ్యవస్థ ద్వారా విస్తృత సేవలందిస్తున్నాం. పింఛన్ల పంపిణీ నుంచి కుల, ఆదాయ, బర్త్, డెత్, మ్యూటేషన్, రేషన్ కార్డు మార్పులు, చేర్పులు, తొలగింపు వంటి సేవలను లబ్ధిదారులకు సకాలంలో అందిస్తున్నాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు అందుబాటులో ఉంటూ సేవలందించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– దశరథ రామయ్య, ఎంపీడీఓ, నందవరం

బాలిక అదృశ్యం

వెల్దుర్తి: మండల పరిధిలోని సూదేపల్లె గ్రామానికి చెందిన మహేశ్వరి (17) అదృశ్యమైనట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం తెలిపారు. యువతి తండ్రి తిమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. శనివారం నాడు తాను, భార్యతో కలిసి పొరుగు గ్రామానికి పని నిమిత్తం వెళ్లి తిరిగిరాగా ఇంట్లో ఉండాల్సిన కుమార్తె కనిపించలేదన్నారు. పలు చోట్ల వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో పోలీసులను ఆశ్రయించామన్నారు. బోగోలుకు చెందిన యువకుడు కిడ్నాప్ చేసి ఉండొచ్చన్న అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్నహ్యాట రోడ్డుకు మరమ్మతులు



రోడ్డును గ్రావెల్ వేసి బాగు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిన చిన్నహ్యాట రోడ్డును మంత్రి గుమ్మనూరు జయరాం ఆదివారం సొంత ఖర్చుతో బాగు చేయించారు. మంత్రి సూచన మేరకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా, నాయకులు ఈశా, ఎంపీటీసీలు కెంచప్ప, శివన్న, కో ఆప్షన్ మెంబర్ సాయిబేష్ తదితరులు ఆదివారం గ్రావెల్‌తో తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. దాదాపు 5 కి.మీ వరకున్న ఈ రోడ్డు అధ్వాన్నంగా మారడంతో ప్రయాణికులు, ఆ మార్గంలోని చిన్నహ్యాట, బీజీ హళ్లి, ఎల్లార్తి, నెరణికి తదితర గ్రామాల ప్రజలతో పాటు ఎల్లార్తి దర్గాల దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై స్పందించిన మంత్రి గుమ్మనూరు జయరాం రోడ్డును బాగు చేసేందుకు సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులను పురమాయించారు. తన సొంత ఖర్చుతో ఆదివారం తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఇటాచీలు, ట్రాక్టర్లు పెట్టి హొళగుంద నుంచి చిన్నహ్యాట వరకు గ్రావెల్ వేసి తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆనంద్ చైతన్య డిమాండ్ చేశారు. పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఎస్సీ వర్గీకరణ దీక్షలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన బీజేపీ తర్వాత మాట తప్పిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఏసన్న, ప్రభాకర్, ప్రసాద్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించకపోతే కేంద్ర ప్రభుత్వానికి తిరుగుబాటు తప్పదని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహాదేవ్ హెచ్చరించారు. ఆదివారం గోనెగండ్లలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లలో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ అమలవుతున్నప్పుడు, ఎస్సీల్లోని 59 ఉప కులాల్లో వర్గీకరణ ఎందుకు ఉండరాదని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహుడు, నరసన్న, ఆదాము, నల్లన్న, బతకన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు సచివాలయ భవనాల ప్రారంభోత్సవం

నందవరం: మండలంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా రీజనల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవమ్మ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. మండలంలోని నాగలదిన్నె, గురజాల గ్రామాల్లో నూతన గ్రామ సచివాలయ భవనాలను వారు ప్రారంభిస్తారని వెల్లడించారు. అనంతరం ముగతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, జేసీఎస్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

చెల్లెమ్మ పెళ్లికి జగనన్న కానుక

- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా ద్వారా ఆర్థిక సాయం
- పేదింటి ఆడపిల్లలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- నియోజకవర్గంలో 236 మందికి లబ్ధి



ఆలూరు రూరల్: పేదింటి ఆడపిల్లల పెళ్లికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2022 అక్టోబర్ 2 నుంచి ప్రారంభించారు. పేదింటి ఆడపడుచుల వివాహాన్ని గౌరవప్రదంగా నిర్వహించేందుకు సీఎం బాసటగా నిలిచారు. బాల్య వివాహాలను నివారించి, పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ, పేదల కుంటుంబాలకు అండగా నిలిచారు. గత టీడీపీ పాలనలో ఎన్నికల సమయంలో మాట ఇచ్చి పథకాన్ని సక్రమంగా అమలు చేయకుండా మోసం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఈ పథకాన్ని అమలు చేస్తుండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదల కుటుంబాల్లో వెలుగులు

కల్యాణమస్తు పథకంతో ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా, పదో తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి నిబంధనలతో ఆడపిల్లల చదువులను ప్రోత్సహించేందుకు తోడ్పాటు అందిస్తున్నారు. అలాగే పేదల కుంటుంబాల్లో వెలుగులు నింపి ఆర్థిక ఆసరాగా నిలుస్తున్నారు. ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఇప్పటివరకు 236 మంది వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫాకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో నాలుగు దరఖాస్తులు మాత్రమే ఎంపీడీఓ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. మిగిలిన లబ్ధిదారులకు ఇప్పటికే నగదును వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష, కులాంతర వివాహం చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.50 వేలు, కులాంతర వివాహం చేసుకున్న బీసీలకు రూ.75 వేలు, విభిన్న ప్రతిభావంతులకు రూ.1.50 లక్షలు, భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు రూ.40 వేలు మంజూరు చేస్తోంది. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం మేలు మరువలేం



ఆలూరులోని మెయిన్ బజార్ కాలనీ నివాసం ఉంటున్న లింగమ్మ, లేట్ పుల్లన్న దంపతుల కుమార్తె మాధవికి హొళగుంద మండల కేంద్రానికి చెందిన చంద్రశేఖర్‌తో ఇటీవల వివాహం జరిగింది. ఆ కుటుంబానికి ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణమస్తు కింద రూ.50 వేలు మంజూరు చేసింది. చంద్రశేఖర్ ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆడపిల్లల పెళ్లి అంటే తల్లిదండ్రులకు ఆర్థికంగా భారం. ఈ భారం తగ్గించేందుకు వైఎస్సార్ కళ్యాణ మస్తు ఉపయోగపడుతోంది. వలంటీర్ సహాయంతో సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే మాధవి తల్లి లింగమ్మ ఖాతాలోకి రూ.50 వేలు జమయ్యాయి. సీఎం చేసిన మేలు మరువలేదనిదని ఆమె కృతజ్ఞతలు చెబుతోంది.

– మాధవి, చంద్రశేఖర్ నూతన దంపతులు, హొళగుంద

అవినీతి చంద్రబాబు ఆటలు సాగవు

వెల్దుర్తి: వ్యవస్థలను గుప్పిట పెట్టుకున్నాం, మాకేమీ కాదనుకునే అవినీతి నాయకులకు చంద్రబాబు అరెస్ట్ చెంపపెట్టు అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి అన్నారు. మాజీ సీఎం చంద్రబాబుకు సీబీఐ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంపై ఆదివారం రాత్రి ఆయన స్పందించారు. వందల కోట్ల ప్రజల సొమ్మును సీఎం హోదాలో ఉండి జేబులోకి వేసుకున్న చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించడం సరైందేనన్నారు. చట్టం ముందు అవినీతిపరుల ఆటలు సాగవన్నారు. చంద్రబాబు అరెస్ట్‌పై టీడీపీ నాయకులు చేసిన హంగామా, ప్రభుత్వానికి అంటగట్టేందుకు చేసిన ప్రయత్నాలు భూటకమని విమర్శించారు. పట్టణ కన్వీనర్ వెంకన్న, జెడ్పీటీసీ సభ్యుడు, ముస్లిం మైనారిటీ మండల కన్వీనర్ ఆరిఫ్ తదితరులు మాట్లాడుతూ.. చంద్రబాబు అవినీతి తవ్వేకొద్దీ బయటపడుతుందన్నారు. ఆయనపై ఉన్న కేసుల్లో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నాయకులు శివారెడ్డి, దేవరాజు, పెద్దన్న, రాజు, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.